నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 28 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాలలోని గర్మిళ్లలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

కొప్పుల ఈశ్వర్ గెలిస్తేనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పాతగర్మిళ్ల, ఎన్‌టీఆర్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 27 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని పాతగర్మిళ్ల, ఎన్‌టీఆర్ నగర్‌లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరపున ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్మిక నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకుంటేనే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ రైతు రుణమాఫీ, మహిళలకు రూ. 2500, రైతుబంధు, క్వింటాలుకు రూ. 500 బోనస్, రూ. 500కే వంట గ్యాస్, తదితర హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి బీఆర్ఎస్ నాయకులను అనరాని మాటలంటున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. కేసీఆర్ పాలనలో పంటలు పచ్చగా ఉండి అధిక దిగుబడులు సాధించిన విషయాన్ని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేత, నాయకులు సుంకరి రమేశ్, ప్రశాంత్, సుఖన్య, కౌసల్య, గంగులు, ఎగ్గెన మల్లేశ్, బిలాల్, మోతు సత్తయ్య, ఇప్ప సురేశ్, కర్రు శంకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 27: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక పనులు చేపట్టవద్దని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. గంజాయి కేసులో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి శనివారం వరకు గంజా యి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7 కేసు లు నమోదయ్యాయని తెలిపారు. రూ. 77 వేల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి 24 గంటలు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక టీమ్స్‌ను ఏర్పాటు చేసి రైల్వేస్టేషన్, బస్టాప్‌ల వద్ద తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా మత్తుపదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీష్, ఎస్ఐ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణను అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలి
- కుటుంబ రాజకీయాలకు పాల్పడుతున్న గడ్డం ఫ్యామిలీకి భంగపాటు తప్పదు
- ఈ పోరులో అంతిమ విజయం కొప్పుల ఈశ్వర్‌దే
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్
- నస్పూర్‌లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి జెండా ఆవిష్కరణ

నస్పూర్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న బాల్క సుమన్, ఈశ్వర్, దివాకర్‌రావు, చిన్నయ్య

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 27 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి, దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. శనివారం నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేశారు. బాల్క సుమన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలు, హక్కులు, పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. వేలాది మంది తెలంగాణ బిడ్డలను పొట్టనబెట్టుకున్న కాంగ్రెస్‌కు, రాష్ట్రానికి నిధులివ్వకుండా వివక్ష చూపిన బీజేపీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనతికాలంలోనే ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. అవకాశవాద రాజకీయాలతో పార్టీలు మారుతూ.. కుటుంబ రాజకీయాలు చేస్తున్న గడ్డం ఫ్యామిలీకి పార్లమెంట్ ఎన్నికల్లో భంగపాటు తప్పదన్నారు. ఓటమితో కుంగిపోకుండా తెలంగాణ సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ప్రజలెప్పుడూ అండగా ఉంటారన్నారు. 26 ఏళ్ల పాటు సింగరేణి కార్మికుడిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్, వేల కోట్ల సామ్రాజ్యానికి అధిపతిగా ఉన్న గడ్డం వంశీ మధ్య జరుగుతున్న ఈ పోరులో అంతిమ విజయం కొప్పుల ఈశ్వర్‌దేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మల్లెత్తుల రాజేంద్రపాణి, గోగుల రవీందర్‌రెడ్డి, రాజారమేశ్, బడికెల సంపత్‌కుమార్, పెట్టం లక్ష్మణ్, రఫీక్‌ఖాన్, గుమ్మడి శ్రీనివాస్, గౌస్, తిప్పని రామ య్య, వడ్లూరి రవి, అన్వేష్‌రెడ్డి, కాటం రాజు, వెంకటేశ్, అమృత రాజ్‌కుమార్, అడ్లకొండ రవిగౌడ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 27: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని రామకృష్ణాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, నాయకులు డా. రాజారమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి.

బీఆర్ఎస్ పోరాటం వల్లే తెలంగాణ

- ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఆసిఫాబాద్‌లో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ పార్టీ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులతో కలిసి పార్టీ జెండా ఎగరేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని, తమ పార్టీ రైతులు, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగు, తాగు నీరు లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న మద్యం పట్టివేత

రూ. 2 లక్షల విలువైన కాటన్లు స్వాధీనం

పట్టుకున్న మద్యం, నిందితుడిని చూపిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

భీమారం, ఏప్రిల్ 27 : మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రకు టాటా ఏస్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ. 2 లక్షల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఉదయం భీమారం శివారులోని మంచిర్యాల – చెన్నూర్ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా, కోటపల్లి మండలం అన్నారంకు చెందిన మహ్మద్ షరీఫ్, అదే గ్రామానికి చెందిన రమణయ్య టాటా ఏస్‌లో తరలిస్తున్న 25 కాట్లన్ల మద్యంతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న, ఎస్ఐ రాములు, సిబ్బంది సంపత్, తిరుపతి, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

కౌటాలలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తాం

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- కౌటాలలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ తనిఖీ

కౌటాల, ఏప్రిల్ 27 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అందులోని బ్రేకర్ల పనితీరు, కెపాసిటీ, ఏఏ సబ్ స్టేషన్‌లకు ఇక్కడ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది, ఎంత వినియోగం అవసరముంది, విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాగజ్‌నగర్‌లోని ఈస్‌గాం 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కౌటాల వరకు 33 కేవీ విద్యుత్‌లేన్ పూర్తిగా అటవీ ప్రాంతం గుండా ఉండడం వల్ల వర్షాలు, గాలులు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తుతున్నట్లు ఆయన తెలిపారు. కౌటాల నుంచి గుండాయిపేట, రవీంద్ర నగర్, రెబ్బెన, బెజ్జూర్ వరకు 33 కేవీ విద్యుత్ సరఫరా జరుగుతుందని, అయితే కాగజ్‌నగర్ ఈస్‌గాం నుంచి 70 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల నిత్యం సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. తలోడి గ్రామ శివారులో నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి కావాల్సి ఉందని, ఆ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. 132/33 సబ్ స్టేషన్ మ్యాప్, విద్యుత్ లేన్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సబ్ స్టేషన్ పూర్తయితే దాదాపు విద్యుత్ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఆయన వెంట ఎస్ఈ వాసుదేవ్, డీఈ నాగరాజ్, ఏడీఈ రాజేశ్వర్, ఏఈ రవీందర్, విద్యుత్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నీరు లేదు.. నీడ లేదు..

- ఎండలో ఉపాధి కూలీల కష్టాలు
- ఎంపీడీవోలకు నోటీసులు ఇచ్చినా స్పందన కరువు

పనుల వద్ద నీడ కల్పించాలి..

ఎండలు బాగా కొడుతున్నాయి. మేము పనులు చేసే దగ్గర నీడ లేదు. ఎండలోనే పనులు చేస్తున్నాం. ఏదైనా దెబ్బ తగిలితే కూడా ఎవరూ పట్టించుకోరు. కనీసం పనులు చేసే దగ్గర కూలీల కోసం తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వడం లేదు. అధికారులు పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీసం తాగునీరు, నీడ వసతి కల్పించాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో అందరం ఉపాధి పనులకే వస్తున్నాం.
- భీమయ్య, ఉపాధి కూలీ, తుంపల్లి.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : ఉపాధి హామీ కూలీలకు పనిచేసే ప్రదేశాల్లో కనీస వసతులు లేకపోవడంతో మండుతున్న ఎండలోనే పనులు చేస్తున్నారు. నీడ, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కిట్లు అందుబాటులో ఉంచడం లేదు. ఇటీవల క్షేత్రాస్థాయిలో తనిఖీలు చేపట్టిన ఉన్నతాధికారులు పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించకపోవడంతో 12 మంది ఎంపీడీవోలకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగియడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అవుతున్నాయి. కూలీలు ఎండలో సతమతమవుతూ పనులు చేస్తున్నారు. కూలీలు పనిచేస్తున్నప్పుడు కాలుపై గడ్డపార పడిన, ఏదైన క్రిమికీటకాలతో ఏదైనా ప్రమాదం సంభవించినా కూలీలకు చికిత్స చేయటానికి సౌకర్యాలను కల్పించడం లేదు. ముందస్తు చర్యల్లో భాగంగా కూలీలు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు చేపట్టడం లేదు.

ఎండలోనే పనులు చేయాల్సి వస్తుంది..

బయట కూలీ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వస్తున్నాం. ఎండకాలంలో ఇంటిని గడుపుకునేందుకు కష్టమవుతోంది. అందుకనే ఈ ఉపాధి పనులకు వస్తున్నాం. పని చేసే చోట ఎంత కష్టమైనప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో పనులు చేస్తున్నాం. పనిచేసే చోట తాగేందుకు నీళ్లు లేకపోవడంతో మేము పనికి వచ్చేటప్పుడే ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. నీళ్లు తెచ్చిన కొద్ది సేపటికే అవి అయిపోతున్నాయి. దాహాన్ని అపుకుని మరీ పనులు చేయాల్సి వస్తుంది. అధికారులు కనీసం తాగేందుకు నీళ్లైనా ఇవ్వాలి.
- మల్లక్క, ఉపాధి కూలీ, తుంపల్లి.

బిల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం

- మిషన్లు, మీటర్లు, స్టార్టర్లు, ధాన్యం, బియ్యం బస్తాలు దగ్ధం
- రూ. 5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు అంచనా

నెన్నెల, ఏప్రిల్ 27 : నెన్నెలలోని బొమ్మెన హరీశ్‌గౌడ్‌కు చెందిన మినీ రైస్ మిల్లులో శనివారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగింది. మిల్లు ఆపరేటర్ వెంకటేశ్ 3 గంటల ప్రాంతంలో మిల్లు వద్దకు వచ్చాడు. షెటర్ తెరిచి చూడగా, లోపల మంటలు కనిపించాయి. చుట్టు పక్కల వారిని పిలువగా, వారు వచ్చి నీళ్లు చల్లి మంటలార్పివేశారు. కరంట్ మీటర్లు, ఆపరేటింగ్ మిషన్లు, స్టాటర్లు, కేబుళ్లు, బియ్యం, ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు యాజమాని బొమ్మెన హరీశ్‌గౌడ్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అనుమానాలున్నాయి. ఘటనా స్థలంలోఅగ్గిపెట్టె కనిపించడంతో పాటు రేకు తలుపు వంగి ఉండడంతో హరీశ్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రైస్ మిల్లును పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు గట్టు మల్లేశ్, మల్లాగౌడ్, చెన్నోజి శంకరయ్య ఉన్నారు.

ధర్మారం, బూర్గుపల్లిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన అధికారులు

భీమారం, ఏప్రిల్ 27 : ధర్మారం, బూర్గుపల్లి గ్రామాల్లో శనివారం ఎట్టకేలకు ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'ఎక్కడి ధాన్యం అక్కడే.. ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు' పేరిట కథనం ప్రచురితమవ్వగా అధికారులు స్పందించారు. ధర్మారంలో సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బూర్గుపల్లి గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ కిషన్ సెంటర్‌ను పరిశీలించారు. ధర్మారంలో కొనుగోళ్లు ప్రారంభించారు. ధర్మారం, బూర్గుపల్లిలోని కొనుగోలు సెంటర్లను తహసీల్దార్ సదానందం, ఆర్ఐ ప్రవంతి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటింగ్ సీసీ రాజన్న, ఏపీఎం త్రియంబకేశ్వర్, సీసీ రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ధర్మారంలో వరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిషన్

సివిల్ కార్యాలయంలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ఆర్కేపీ సీహెచ్‌పీపై కారు గుర్తుకు ఓటు వేయాలని కార్మికులను అభ్యర్థిస్తూ..

ఆశీర్వదిస్తే.. సేవ చేస్తా..

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 27 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే.. అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తానని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం సివిల్ ఆఫీస్, ఆర్కేపీ ఓసీపై సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని కార్మికులు ముక్తకంఠంతో తెలిపారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఓట్లు అభ్యర్థించారు.

విశేష స్పందన

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. రామకృష్ణాపూర్‌లోని రాజీవ్‌చౌక్, బీ జోన్ సెంటర్‌లోని ప్రతి దుకాణానికీ వెళ్లి ప్రచార కరపత్రాలను అందజేశారు. ఆర్కేపీ సీహెచ్‌పీ కార్మికులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, సీనియర్ నాయకుడు డా. రాజారమేశ్, టీబీజీకేఎస్ ఏరియా నాయకుడు మేడిపల్లి సంపత్, బడికెల సంపత్‌కుమార్, పిట్ కార్యదర్శులు, క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, రేవెల్లి ఓదెలు, పారిపెల్లి తిరుపతి, అలుగుల శ్రీలత సత్తయ్య, నాయకులు రామిడికుమార్, ఆసాల రాజన్న, జక్కనబోయిన కుమార్, ఖలీమ్, యూత్ నాయకులు చంద్రకిరణ్, రామిడి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.